క్లుప్తంగా

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్



పట్టుబడిన వాహనాలతో పోలీసులు

కడెం: నేరాలు నియంత్రించేందుకే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని ఖానాపూర్ సీఐ అజయ్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని 40 బైక్‌లు, మూడు ఆటోలు, మూడు కార్లు, అధిక చలాన్లు ఉన్న ఓ బైక్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, ప్రభాకర్‌రెడ్డి, రజనీకాంత్, సర్పంచ్ బొడ్డు గంగన్న పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని డాక్టర్స్‌లైన్ ప్రాంతంలో ఫుట్‌పాత్ ఏర్పాటు పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట డీఈ నాగేశ్వర రావు, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్ సీఐగా శ్రీనివాస్



శ్రీనివాస్

నిర్మల్‌రూరల్: నిర్మల్ రూరల్ సీఐగా బి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వెంకటేశ్ మల్టీజోన్–1కు బదిలీపై వెళ్లారు. ఇంతకుముందు శ్రీనివాస్ శ్రీరాంపూర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు.

నిర్మల్ పట్టణ సీఐగా మల్లేశ్

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ సీఐగా కొంక మల్లేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పని చేసిన మల్లేశ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేసిన శ్రీనివాస్ మల్టీజోన్–1 కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

'వైఫల్యాలను ఎండగట్టేందుకే జోడో యాత్ర'



జెండా ఆవిష్కరిస్తున్న దయానంద్

ఖానాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టేందుకే రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేపట్టారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌యార్డు చౌరస్తాలో భారత్ జోడో యాత్ర ముగింపును పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. దయానంద్, రమేశ్, సత్యం, రవి, శ్రీనివాస్, షారూక్, శంకర్, నర్సయ్య ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖానాపూర్: పక్కా సమాచారం మేరకు మండలంలోని సత్తనపల్లి గ్రామశివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. వారి నుంచి రూ.9800 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటి పైకప్పు దగ్ధం

కుంటాల : మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన అన్నం గంగవ్వ ఇంటి పైకప్పు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. గంగవ్వ సోమవారం మధ్యాహ్నం తాగునీరు తీసుకొచ్చేందుకు బోరు బావి వద్దకు వెళ్లింది. తిరిగి వచ్చే లోపే ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఈ ప్రమాదం సంభవించింది. ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలతోపాటు విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.30 వేల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. డిప్యూటీ తహసీల్దార్ నరేశ్ గౌడ్, సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ కాలనీలో నూతన హనుమాన్ ఆలయంలో ఫిబ్రవరి 1న విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఈమేరకు సోమవారం గోపూజ, ప్రత్యేక హోమాలు, పలు వీధుల గుండా ప్రతిమల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- కంకరతేలి గుంతలమయంగా రోడ్డు
- అదుపుతప్పి కింద పడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న వాహనదారులు



గాంధీనగర్ వద్ద కంకర తేలిన రోడ్డు



పాక్‌పట్ల సమీపంలో..



మాదాపూర్ సమీపంలో గుంతల రోడ్డు

లక్ష్మణచాంద: సోన్ మండలం పాక్‌పట్ల గ్రామం నుంచి గాంధీనగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయంగా మారింది. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఈ మార్గంలో పాక్‌పట్ల, మాదాపూర్, లిఫ్ట్ పోచంపాడ్, గాంధీనగర్ గ్రామాలున్నాయి. దీంతో నిత్యం రోడ్డుపై వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి గుంతలు కన్పించక పలువురు కింద పడి గాయాల పాలవుతున్నారు. లిఫ్ట్‌పోచంపాడ్ వద్ద గురుకులంలో బోధించే ఉపాధ్యాయులు ఏటా ఎనిమిది మంది వరకు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు నెలల కిందట ఓ ఉపాధ్యాయురాలు ఈ రోడ్డుపైనే పడి ఇప్పటికీ కోలుకోకపోవడంతో సెలవులో ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి గ్రామంలో సోమవారం సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. అంతకుముందు మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పార్శపు శ్రీనివాస్, మిర్యాల హరిత, పుప్పాల శంకర్, శ్రావణ్, నవీన్, లక్ష్మీరాజం, చరణ్, బుచ్చాగౌడ్, శేఖర్, నాగేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేను కలిసిన ఉట్నూర్ నూతన డీఎస్పీ

ఉట్నూర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి.నాగేందర్ సోమవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి మొక్క అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, రాథోడ్ రాము నాయక్, పుప్పాల శంకర్, ప్రదీప్ ఉన్నారు.

ఆశవర్కర్ల వినతి

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్లు సోమవారం ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో పలువురు ఆశవర్కర్లు గంగామణి, సుజాత, రజిత, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎంఈవో సుభాష్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణ, ఆసిఫ్, ఫారూక్ ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

కుంటాల: మండల కేంద్రానికి చెందిన గొల్ల గంగారాం అనే వ్యక్తికి రూ.80వేల సీఎం ఆర్ ఎఫ్ చెక్కు మంజూరైంది. కాగా సోమవారం దే గాంలోని తన నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధితుడికి చెక్కు అందజేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, మహేశ్వర్, గజేందర్ పాల్గొన్నారు. ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్‌లో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ఫిబ్రవరి 1న నిర్వహించే భూమిపూజకు రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. హైమ్మద్ పాషా, ఉపసర్పంచ్ రాంజీ, దత్తు, మారుతి ఉన్నారు.



స్టడీ మెటీరియల్ అందుకున్న వారితో ఎమ్మెల్యే

'గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

లక్ష్మణచాంద: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య సూచించారు. సోమవారం సోన్ మండలంలోని సోన్, న్యూవెల్మల్, పాక్‌పట్ల గ్రామాల్లో బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తలతో మాట్లాడారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్‌తో ఏ విధంగా నష్టం జరుగుతుందో ప్రజలకు వివరించాలన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగే అసెంబ్లీస్థాయి సమావేశం విజయవంతం చేయాలని కోరారు. ఇందులో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మురళీ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, మండలాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే అభ్యర్థులకు న్యాయం

ఖానాపూర్: బీజేవైఎం చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏడు మార్కులు కలిపిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో స్వీట్లు పంచారు. ఉపేందర్, సాయినాథ్, శ్రావన్, కీర్తి, సత్యనారాయణ, వేణు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఓబీసీలు ఐక్యంగా ఉద్యమించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగే భోజన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా నిర్మల్ మండల కమిటీ, నిర్మల్‌టౌన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో 27 మంది బీసీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం నారాయణగౌడ్, పట్టణ అధ్యక్షులు పాతర్ల గణేశ్, నిర్మల్ మండలాధ్యక్షులు కొండ మురళిగౌడ్, విలాస్, అనిల్, భాస్కర్, లవకుమార్‌గౌడ్, నరేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సోన్‌లో మాట్లాడుతున్న భూమయ్య

సాగులో మెలకువలు పాటించాలి

కుంటాల : వరి పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో సోమలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంబకంటి గ్రామంలో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంటను సోకే కాండం తొలుచు పురుగు నివారణకు రెండు గ్రాముల కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీని లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఈవోలు శ్రీధర్, మహేశ్, ప్రగతి, గణేశ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద, జోహర్‌పూర్, లోకేశ్వరం శివారు ప్రాంతంలోని వరి పంటలను మంగళవారం ఏఈవోలు మౌనిక, భూమేశ్ పరిశీలించారు. పంటలకు కాండం తొలుచు, పాముపొడా, జింక్ లోపం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటి నివారణకు హెక్సాజాక్లోజ్, జింక్ పౌడర్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు.



లోకేశ్వరంలో పరిశీలిస్తున్న ఏఈవో మౌనిక

లక్ష్మణచాంద: సోన్ మండలం మాదాపూర్‌లో జొన్న పంటను సోమవారం క్లస్టర్ ఏఈవో అశోక్ పరిశీలించారు. కంకి దశలో ఉన్న పంటకు నీటిని సక్రమంగా అందించాలని రైతులకు సూచించారు.

పౌరహక్కులపై అవగాహన

ముధోల్: మండలంలోని అష్ట గ్రామంలో సోమవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే(పౌరహక్కుల దినోత్సవం) నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్ఐ అభిమన్యు, సర్పంచ్ సుకన్య రమేశ్, ఎంపీటీసీలు సునీత, పోశెట్టి, కార్యదర్శి పోతన్న ఉన్నారు.

ఈరోజు

కుంటాలలో ధర్నా

కుంటాల : పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడంలో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు భోస్లే మోహన్‌రావుపటేల్ ఆధ్వర్యంలో మంగళవారం కుంటాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఓల ఎంపీటీసీ కట్ట రవి, నాయకులు సాధు ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్యే రాక

కుభీర్: మండలంలోని దొడర్నా గ్రామంలో మంగళవారం హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి భూమిపూజ చేస్తారని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం దావూజీనాయక్ తండాలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తారని.. ప్రజలు, కార్యకర్తలు వచ్చి జయప్రదం చేయాలన్నారు.

చెక్కులు పంపిణీ

ముధోల్: మండలకేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ శ్యాసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

భైంసా: బాసర తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కె.శ్యామ్ ఓ ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

తానూరు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. నర్సరీల నిర్వహణను పర్యవేక్షించాలన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: అఖిలభారత బంజారా సేవాసంఘం 70వ ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్‌ను బంజారా సంఘం జిల్లా నాయకులు సిద్ధార్థనాయక్ సన్మానించారు. బంజారాలంతా ఏకతాటిపై నిలిచి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

'కంటివెలుగు' కేంద్రాలు పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

తానూరు: అర్హులంతా కంటిపరీక్షలు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని దౌలతాబాద్‌లో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీవో పరిశీలించారు. తహసీల్దార్ వెంకటరమణ, కార్యదర్శి లక్ష్మణ్, పవన్, సిబ్బంది ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్, సేవాలాల్‌తండాలో కంటివెలుగు వైద్య శిబిరాలను లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ పరిశీలించారు.

కుంటాల : మండలంలోని విఠాపూర్‌లో కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్ ప్రారంభించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.ఎ కలీం, ఉపసర్పంచ్ నవీన్, వైద్యులు శృతిరెడ్డి, దామోదర్, కవిత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

పెచ్చులు ఊడుతున్నాయ్



భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామపంచాయతీ భవనంలో స్లాబు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో ఇనుపచువ్వలు బయటకు వస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయానికి వచ్చేవారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: గోపాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో ఫోన్: 9908523064

ఘనంగా భీమన్న జాతర



వద్యాల్‌లో ఆలయం వద్ద భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, వద్యాల్ గ్రామాల్లో భీమన్న జాతర ఘనంగా నిర్వహించారు. గోదావరిలో పుణ్యస్నానం అనంతరం సోమవారం ఉదయం భీమన్న గదలు ఆలయానికి చేరుకోవడంతో జాతర మొదలైంది. ఈసందర్భంగా కోరికలు తీరుతాయని పలువురు అగ్నిగుండంలోంచి నడిచి వెళ్లారు. అనంతరం ప్రత్యేకపూజలు, వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

కుంటాల: మండల కేంద్రంలో ఈనెల 26న ప్రారంభమైన బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. టోర్నీలో తానూర్ మండలం భోసి గ్రామానికి చెందిన సుధాకర్–నవీన్ ప్రథమ స్థానంలో నిలవగా వీరికి రూ.8వేలు, ద్వితీయ స్థానం నిలిచిన రాజశేఖర్–రాజుకు రూ.నాలుగు వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నవీన్–ముత్యంకు రూ.రెండు వేలు, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, జీవీ రమణారావు, అనిల్, వెంకటేశ్ పలువురు నిర్వాహకులు రాజశేఖర్, జుట్టు నవీన్, ముత్యం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల సాయం అందజేత



కుటుంబీకులకు సాయం అందిస్తున్న రాజేశ్వర్

సారంగాపూర్: మండలంలోని ధని గ్రామ మాజీ సర్పంచ్ బట్టికాడి సాగర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఇదే గ్రామానికి చెందిన ఆకుల రాజేశ్వర్.. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి వారికి రూ.50వేలను సాయంగా అందించారు. సాగర్ గ్రామానికి చేసిన సేవలను దృష్టిలో ఉంచుకొని తన ఇద్దరు కూతుళ్ల చదువుల కోసం ఆర్థికసాయం అందించినట్లు రాజేశ్వర్ తెలిపారు. ప్రజాసేవకే పరిమితమైన సాగర్ కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు.

పార్డి(బి)లో పశువైద్య శిబిరం



చికిత్స చేస్తున్న వైద్యుడు విశ్వజిత్

కుభీర్: మండలంలోని పార్డి(బి)గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పశువులకు గర్భకోశ చికిత్స అందించారు. పాల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, పశువైద్యాధికారి విశ్వజిత్, సర్పంచ్ పుష్ప, ఉపసర్పంచ్ తుకారాం, గంగయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



కడెంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల నివాళి



రాచాపూర్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కడెం: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమవారం గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు కొల్లూరి శ్రీనివాస్, భూపాల్, కృష్ణ, నగేశ్, ప్రసాద్, వెంకటేశం ఉన్నారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. సతీశ్‌రెడ్డి, రఫీక్, వాజీద్, సలీం, భూషణం, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోశ్.. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు నాగరాజు, శ్రీజ, జోహార్, గోపి, ఆనంద్‌కిశోర్ ఉన్నారు.

కుంటాల : మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ దోనిగామ సంతోశ్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జితేందర్, లక్ష్మీనారాయణ, సతీష్, జలేందర్, రత్నాకర్‌రావు, విశ్వనాథం, సుదర్శన్, అశోక్ ఉన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో గాంధీ విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యస్.ఎన్.రెడ్డి, లక్ష్మణ్, అనంతరావ్ ఉన్నారు

నర్సాపూర్(జి): మండల ప్రజాపరిషత్ కార్యాలయం, బామిని(బి) కంటి వెలుగు శిబిరాల్లో మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ సుగుణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో నష్టపోతున్నాం

ముధోల్: విద్యుత్ అధికారులు ఇష్టానుసారం కరెంట్ కోతలు విధిస్తుండటంతో పంటలకు నీరు అందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు ముధోల్‌లోని పోలీస్‌స్టేషన్ వద్ద చౌరస్తాపై బైఠాయించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్ మాట్లాడారు. 24 గంటల కరెంటు ఇస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం రెగ్యులర్‌గా 12 గంటల కరెంట్ కూడా ఇవ్వట్లేదని వాపోయారు. సంఘం మండలాధ్యక్షుడు మేస్త్రీ నారాయణ, మహిరాజు, కృష్ణారెడ్డి, పోశన్న, భోజన్న తదితరులు ఉన్నారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు